విద్యార్థికి షైనింగ్‌స్టార్ అవార్డును అందిస్తున్న కలెక్టర్ చేతన్

అకృత్యాలపై నిరసనాగ్రహం

◆ సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

◆ అనంత ఎస్పీ కార్యాలయం వద్ద వైసిపి నిరసన

◆ నేడు ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం కలెక్టరేట్

మహిళలు, విద్యార్థినులు, బాలికలపై ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను నిరసిస్తూ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనాగ్రహం వ్యక్తం అయ్యింది. అనంతపురం రామకృష్ణ కాలనీకి చెందిన గిరిజన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో దళిత విద్యార్థినిపై అత్యాచార ఘటనలో నిందితులను శిక్షించాలని, ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. తన్మయి హత్య కేసులో నిందితులను శిక్షించాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో అనంతపురం ఎస్పీ కార్యాలయం వద్ద వైసిపి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రామగిరి ఘటనలో నిందితులు ఎవరినీ వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసిపి నాయకులు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్నను కలిసి వినతిపత్రం అందజేశారు.

సిపిఎం రాస్తారోకో

అనంతపురం కలెక్టరేట్ : గిరిజన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో దళిత విద్యార్థినిపై అత్యాచార ఘటనలో నిందితులను శిక్షించాలని, ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిపై సిపిఎం నాయకులు, కార్యకర్తలు బైటాయించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సమయంలో పోలీసులు వారిని వారించి రాస్తారోకో విరమించాలని కోరారు. బాలికలు, విద్యార్థినులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారంటూ సిపిఎం నాయకులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిపిఎం అనంతపురం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వరుసగా విద్యార్థినులపై జరిగిన ఘటనలు కలిచి వేస్తున్నాయని చెప్పారు. రామగిరి మండలంలో మైనర్ దళిత బాలికను దుండగులు బెదిరించి, వీడియోలు చిత్రించి 6 నెలలుగా 14 మంది అత్యాచారం చేశారన్నారు. ఇది మరవకముందే అనంతపురం సమీపంలోని రామక్రిష్ణ కాలనీకి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని తన్మయిని ప్రేమ పేరుతో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అతి కిరాతకంగా హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూతురు కన్పించడం లేదంటూ విద్యార్థిని తల్లిదండ్రులు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 3వ తేదీ ఫిర్యాదు చేసినా పోలీసులు సరిగా స్పందించలేదన్నారు. పోలీసులు విచారించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే విద్యార్థిని హత్యకు గురైందన్నారు. రామగిరి ఘటనలోనూ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. దళిత, గిరిజన విద్యార్థినులు, మహిళలపై వరుస ఘటనలు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వహస్తున్నట్లు ఉందన్నారు. రామగిరిలో మహిళా ఎమ్మెల్యే, ఆ జిల్లాలో మహిళా మంత్రి, మహిళా ఎస్పీ ఉన్నా మైనర్ బాలికకు న్యాయం జరగని దుస్థితి నెలకొందన్నారు. తన్మయి ఘటనలో స్థానిక ఎమ్మెల్యే రూ.లక్ష ఇచ్చి సరిపెట్టినట్లు ఉందన్నారు. అమ్మాయి మానం, ప్రాణం రూ.లక్షతో వెలకట్టలేమన్నారు. నిందితులను శిక్షించేలా ఎమ్మెల్యేలు, మంత్రులు చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుల్లో ఏ రాజకీయ పార్టీ వారు ఉన్నా ఉపేక్షించకూడదని డిమాండ్ చేశారు. తన్మయి హత్య నిందితులను, మైనర్ బాలికను అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. లేని పక్షంలో పోలీసు కార్యాలయ వద్ద ఆందోళనలు చేపడతమన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న సిఐ వెంకటేష్ నాయక్ సిపిఎం నాయకులతో మాట్లాడారు. నిందితులను పట్టుకుని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వలి, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, మన్నీల రామాంజినేయులు, సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ లక్ష్మి నరసమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఉమ్మడి జిల్లాలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, హత్యలను నియంత్రించాలని కోరుతూ మంగళవారం నాడు ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు అనంతపురం ఎన్జీవో హోంలో ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. మేధావులు, కవులు, విద్యార్థులు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిందితులను శిక్షించాలి : ఐద్వా

ఇంటర్ విద్యార్థి తన్మయి హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో వరుసగా హత్యలు, అత్యాచార సంఘటనలో జరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం అన్నారు. మహిళల ప్రాణాలకు రక్షణ కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న సంఘటనలపై స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు ప్రాంతంలో అత్తా కోడళ్లపై గ్యాంగ్ రేప్ మొదలుకుని రామగిరిలో మైనర్ బాలిక, కూడేరు ప్రాంతంలో విద్యార్థి దారుణహత్య ఘటనలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. పేదరికంలో ఉన్న హరిజన, గిరిజన కుటుంబాల మహిళలను లక్ష్యంగా చేసుకుని కొందరు వారిపై ఘోరాలకు తెగబడుతున్నారన్నారు. మద్యం, గంజాయికి అలవాటు పడిన యువత ఈ కిరాతక చర్యలకు పాల్పడుతోందన్నారు. ఘటనలు జరిగిన వెంటనే పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో నిందితులు మరింత రెచ్చిపోతున్నారని తెలిపారు. ఇలాంటి నేరాలకు కారణమవుతున్న వారిని వెంటనే అరెస్టు చేసి, నిష్పక్షపాతంగా వ్యవహరించి శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల, నగర నాయకులు చంద్రిక, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

అనంత ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

ఎస్పీ కార్యాలయం ఎదుట వైసిపి నిరసన

అనంతపురం జిల్లాలో ఇంటర్ చదివే విద్యార్థిని తన్మయిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థిని కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం ఎస్పీ కార్యాలయం ఎదుట వైసిపి నాయకులు ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయరు వసీం, డిప్యూటీ మేయరు వాసంతి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయ గిరిజమ్మ మాట్లాడుతూ మహిళలకు భద్రతను కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత చెబుతున్నా ఆచరణలో వాటి అమలు ఏ మాత్రం లేదన్నారు. రాష్ట్రంలో వరుసగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ఈ ప్రభుత్వం విఫలం చెందిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తన్మయి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చదువుతోనే అభివృద్ధి

◆ కలెక్టర్ టిఎస్.చేతన్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి

◆ 215 మందికి షైనింగ్‌స్టార్స్ అవార్డులు అందజేత

ప్రజాశక్తి-కొత్తచెరువు

చదువుతోనే అభివృద్ధి సాధ్యం అని, అందుకు అనుగుణంగా కష్టపడి చదవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కొత్తచెరువులోని మైలేపల్లి శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో షైనింగ్ స్టార్స్ అవార్డుల అందజేత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. షైనింగ్ స్టార్స్ గుర్తింపు ప్రోత్సాహంలో భాగంగా 38 మంది ఇంటర్మీడియట్, 187 మంది పదో తరగతి విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.20 వేల చెక్కు, ప్రశంసా పత్రం, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో తట్టుకుని అందుకు తగ్గట్టుగా ప్రణాళికతో ముందుకు వెళ్లాన్నారుఎ. నాగరిక ప్రపంచంలో సోషల్ మీడియా ఉచ్చులో విద్యార్థులు చిక్కుకుపోకుండా చదువుపై దృష్టి సారించాలని తెలియజేశారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిష్టప్ప, ఇంటర్మీడియట్ అధికారి దేవరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న ఏఓ, సర్పంచి

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-పెనుకొండ

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎన్ఎస్.రాజు, శిరీష తెలిపారు. మండలంలోని రాంపురం రైతు సేవా కేంద్రంలో సోమవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టారు. శాస్త్రవేత్తలు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, రసాయ ఎరువుల వాడకం తగ్గింపుపై రైతులతో అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పాలన్నారు. పంటల సాగులో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏఓ కెసి చందన మాట్లాడుతూ నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్లతో పురుగు మందుల పిచికారి, వ్యవసాయ శాఖలో అమలవుతున్న అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకోవడం, తదితర అంశాలపై వివరించారు. 40 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగ పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రాంపురం సర్పంచి శ్రీనివాసులు రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎఇఒ అశోక్‌కుమార్, ఆర్ఎస్‌కె సిబ్బంది రమ్యకృష్ణ, బ్లెస్సీ, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలంలోని గుడిపల్లి గ్రామ సచివాలయంలో సోమవారం వ్యవసాయ అధికారిణి కవితా రాణి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాస్త్రవేత్త యుగంధర్ హాజరై రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రామ్‌ప్రసాద్, సచివాలయ, వ్యవసాయ సిబ్బంది బాలకృష్ణ, బాబావలి, రైతులు వెంకటరమణ, సూరప్ప, కోదండరామప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సిపిఎం ఆధ్వర్యంలో భూపోరాటం

ప్రజాశక్తి - కదిరి టౌన్

అధికారాన్ని అడ్డుపెట్టుకొని పేదల పేరుతో ప్రభుత్వ భూములు దోచేస్తున్న పట్టించుకోని ప్రభుత్వం నిలువు నీడలేని పేదలు సెంటు జాగా కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని ఇక తామే సెంటు జాగా కోసం పోరాటం చేయక తప్పదని భావించిన పేద ప్రజలు ఇళ్లస్థలాల కోసం భూపోరాటానికి సిద్ధమ య్యారు. కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని పేదలు ఇళ్ల స్థలాలు కోసం సర్వే నెంబర్ 720 ప్రభుత్వ భూమిలో సిపిఎం ఆధ్వర్యంలో జెండాలు నాటారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిఎల్ నరసింహులు మాట్లా డుతూ గత ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో ఐదేళ్ల కాలయాపన చేసిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, రూరల్ పరిధిలో 3 సెంట్లు ఇస్తామని చెప్పి ఏడాది కాలం పూర్తి అవుతున్నా స్థలాలు కేటాయించలేదని విమర్శించారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని 3 నెలల నుంచి సచివాలయాల వద్ద, తాహశీల్దార్ కార్యాలయం వద్ద, పుట్టపర్తి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ఆందోళన నిర్వహించామని తెలిపారు. సచివాలయాల్లో ఇంటి స్థలం కోసం దరఖాస్తులు అందజేసి మూడు నెలలు అవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు దరఖాస్తులను విచారణ కూడా చేయలేదని విమర్శించారు. పేదలు రోజువారి కూలి డబ్బులతో కుటుంబాలను పోషించుకోవడమే భారంగా ఉందన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని 720 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పేదలిచ్చిన దరఖాస్తులను విచారణ చేసి ఇళ్ల స్థలాలు కేటాయించాలని లేనిపక్షంలో ఈ భూమిలో గుడిసెలు వేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబశివ, శాంతిబాయి, బాబ్జాన్, శివ, ముస్తాక్, శంకర్ రెడ్డి, మహిళలు కాంతమ్మ, సరస్వతి, భారతి, రిజ్వానా, ప్రసన్న, గంగాదేవి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో జెండాలు పాతిన సిపిఎం నాయకులు

వ్యవసాయ మార్కెట్ మార్డ్‌ను అభివృద్ధి చేయాలి

నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నూతన పాలక మండలికి సూచించారు. మార్కెట్ మార్డ్‌లో సోమవారం వ్యవసాయ మార్కెట్ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఛైర్మన్‌గా గురుమూర్తి, వైస్ ఛైర్‌పర్సన్‌గా శ్రీదేవిమనోహర్, సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు పండించిన చింత, వేరుశెనగ, వక్క, మిర్చి, తదితర పంటలకు స్థానికంగానే మార్కెటింగ్ సౌలభ్యం కల్పించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి సామాజిక వర్గాల వారీగా నియమించామన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు విశేష సేవలందించిన బిఎస్.గురుమూర్తిని ఛైర్మన్‌గా, మనోహర్ సతీమణి శ్రీదేవిని వైస్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. పార్టీని నమ్ముకొని పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తారన్నారు. వైసిపి హయాంలో వ్యవసాయ మార్కెట్ పాలకమండలి సభ్యుల పదవులను డబ్బులకు అమ్ముకున్న నీచమైన చరిత్ర ఆ పార్టీ నాయకులకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అంజనప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారథిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, విఎం పాండురంగప్ప, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, గణేష్, మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, జడ్పిటిసి ఉమేష్, నరసింహమూర్తి, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజు, నూతన ఛైర్మన్ గురుమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

జీవో-30 ప్రకారం నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం వ్యవసాయ, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ మారుతికి సోమవారంవినతిపత్రం ఇచ్చారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పాలసముద్రంలో ఇల్లు లేని పేదలు సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిసున్నారన్నారు. వారు ఇళ్ల పట్టాల కోసం నాలుగేళ్లుగా పలుమార్లు దరఖాస్తు చేసుకోవడంతో పాటు హైకోర్టును ఆశ్రయించగా 3 నెలల్లోపు పేదలకు పట్టాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉన్న కుటుంబాలను అర్హులుగా గుర్తించి పట్టాలు ఇవ్వాలని ప్రస్తుత ప్రభుత్వం జీవో 30ని విడుదల చేసింద న్నారు. ఈ జీవో మేరకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే విశాఖ ఉక్కును ప్రయివేట్ పరం చేసేందుకు ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని, అందులో భాగంగానే ప్రస్తుతం 2వేల మంది కార్మికులను తొలగించిందని మండిపడ్డారు. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రశ్నించకపోవడం దుర్మార్గమ న్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యవసాయ, భవన నిర్మాణ కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయ న్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్వహించాలని, సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయ కులు స్వర్ణలత, కొండా వెంకటేష్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు అంజలి, ముత్యాలప్ప, లోకేష్, వెంకటలక్ష్మి, భాస్కర్, రామాంజనేయులు, రత్నమ్మ, షాతాజ్, గంగాధర్, బాబా పాల్గొన్నారు.

తహశీల్దార్ మారుతికి వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఉపాధి కూలీ మృతి

తలుపుల : మండలంలోని బత్రేపల్లి కి చెందిన ఉపాధి కూలీ సోమవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన కదిరయ్య (59) సోమవారం ఉద యం ఉపాధి పనికి వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో ఛాతి నొప్పి ఎక్కువకావటంలో కిందికి పడిపోయాడు. 108 సాయంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కదిరియ్య మృతిచెందాడు.

ఆర్ఎస్‌కెలకు చేరిన విత్తన వేరుశనగ

సోమందేపల్లి : మండలంలోని రైతు సేవా కేంద్రాలకు సోమవారం విత్తన వేరుశనగ వచ్చినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. 10 సచివాలయాలకు 50 క్వింటాళ్ల చొప్పున, మేజర్ పంచాయతీ పరిధిలోని 4 సచివాలయాలకు 120 క్వింటాళ్ల చొప్పున అందినట్లు తెలిపారు. టిడిపి టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, వ్యవసాయ అధికారులు అలేఖ్య, సబిహా, ఆనంద్ నాణ్యతను పరిశీలించారు.

విశాఖ ఉక్కు కార్మికులకు సంఘీభావం

మడకశిర రూరల్ : విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, పద్మావతి, ఆరీఫా, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో సామూహిక అత్యాచారానికి గురైన దళిత బాలికకు న్యాయం చేయాలని బహుజన చైతన్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, గౌరవ సలహాదారులు వెంకటేశులు, బాబు, రామాంజనప్ప, సూర్యనారాయణ, క్రిష్టప్ప, కదిరప్ప, ట్రెజరర్ రామాంజనప్ప, రామదాసు, నరేష్, ప్రశాంతి, లక్ష్మీదేవి, రత్నమ్మ, భారతి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

పెనుకొండ : యోగాతో ఆరోగ్యం పదిలం అని ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. యోగాంధ్ర-2025లో భాగంగా సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్, ట్యాంక్ సర్కిల్, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. యోగా ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, కమిషనర్ సతీష్ కుమార్, సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రతాప్, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, త్రివేంద్ర, సాయిప్రసాద్, ప్రభంజనకుమార్, చంద్రకాంతమ్మ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ఎంపిడిఒ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం చాలా ప్రాధాన్యమని, ఎంత బిజీగా ఉన్నా కొద్ది సమయం యోగా సనాలు వేయాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

లేపాక్షి : యోగాంధ్రలో భాగంగా స్థానిక నవోదయ పాఠశాల నుంచి నంది విగ్రహం వరకూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఇఒ నాగరాజునాయక్, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ నాగరాజు, ఆయుర్వేదిక్ వైద్యురాలు, డిటి కుమార్‌రెడ్డి, ఎంజెపి ప్రిన్సిపల్ సుందర్‌రాజు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు నలుగురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని మోతుకపల్లి సమీపంలో టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు సమీపంలో ఆడుకుంటున్న నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తీసుకుని వచ్చి వైద్య సేవలను అందించారు. ో మోతుకపల్లికి చెందిన రాకేష్, వంశీ, తరుణ్, ప్రణీత్ లు కలిసి ఆడుకుంటున్నారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు రావడంతో పాటు పిడుగు పడింది. దీనివల్ల వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే బంధువులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

పంటరుణాల రెన్యువల్ గడువు పెంచాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

జిల్లా లోని రైతులకు పంట రెన్యూవల్ గడువును పెంచాలని ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షులు ఆలకుంట మారుతి డిమాండ్ చేశారు. సోమవారం ధర్మవరం పట్టణం సి పి ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ,రైతులు తమ పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవడానికి ఈ ఖరీఫ్ సీజన్ అంతా గడువు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఒక రోజులోనే ఒకేసారి రుణాన్ని చెల్లించిన రైతులకు రుణం పెంచి ఇవ్వాలన్నారు.

నేడు మంత్రి పర్యటన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గంలో 10, 11వ తేదీలలో రెండు రోజులపాటు పర్యటిస్తారని నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడిమర్రి మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు, తరువాత అక్కడే నూతనంగా నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ బ్లాక్ ప్రారంభిస్తారని, అనంతరం అనంతపురం ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. 11వ తేదీ బుధవారం ధర్మవరం కాలేజ్ గ్రౌండ్ లో యోగా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువుకు చెందిన మణికేశవ్ అనే వ్యక్తి గ్రామంలో ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. తన తండ్రి రాజు నాయక్ జ్ఞాపకార్థం తన తలిల కె. భారతితో కలసి మణికేశవ్ ఆలయ నిర్మాణం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణ, మహేష్ బాబు, నరసింహారెడ్డి, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లాలోని 2025 -26 సంవత్సరానికి గాను కేజీబీవీ- టైప్4 గర్ల్స్ హాస్టల్స్ పాఠశాలలు ప్రారంభించాలని సత్య సాయి జిల్లా సమగ్ర శిక్ష అధికారి పి దేవరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమందేపల్లి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల గాండ్లపెంట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడిబండ, పాఠశాలల్లో బాలికలకు మాత్రమే ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. 9, 10,11,12 తరగతుల వారికి మాత్రమే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. జూన్ 30వ తేదీ అడ్మిషన్లకు చివరి తేదీ అన్నారు. వివరాలుకు ఎంఇఒలను, పాఠశాల హెచ్ఎంలను సంప్రదించాలని ఆయన తెలిపారు.

తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి తలుపుల

మండల పరిధిలోని బండ్లపల్లి వాసులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి పథకం పైపుల నుంచి నీరు వృథాగా వెళుతుండగా తమకు నీరు అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గత 5 రోజుల నుండి బోరు దగ్గర నీటి నీరు వృథాగా పోతోందన్నారు. నీటి పైపులకు కొళాయిలు బిగించాలని వారు కోరుతున్నారు.

అధికారి బదిలీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా ఏపీఐఐసీ భూముల లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టిన అధికారులు జోనల్ అధికారి సోనీ ని బదిలీ చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఐఐసీ భూముల లో జరిగిన అవకతవకలపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఏపీఐఐసీ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఏపీఐఐసీ ఛైర్మన్ కుమ్మరవాండ్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా లో జరిగిన అవకతవకల పై విచారణ జరిపించి అదుకు బాధ్యులైన జోనల్ అధికారిని బదిలీ చేసినట్లు తెలిపారు.

తెలుగు మహిళల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాజధాని అమరావతి మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ కార్యాలయం ముందు తెలుగుమహిళలు నిరసన తెలియజేస్తూ సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. తెలుగు మహిళా నాయకురాలు పర్వీన్ భాను, ప్రేమలత ఆధ్వర్యంలో పలువురు మహిళా విభాగపు సభ్యురాళ్లు సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. సాక్షి ఛానల్ లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసులు, కృష్ణంరాజును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల పక్షాన సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం వారి పక్షాన సిఐటియు నిలుస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన సిఐటియు మండల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండలంలో సిఐటియు బలోపేతానికి నూతనంగా నాయకులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. పట్టణ కార్యదర్శిగా పైపల్లి గంగాధర్, కోకన్వీనర్ గా పెడపల్లి బాబా ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అంగనవాడి నాయకురాలు సుజాత, మున్సిపల్ వర్కర్ల సంఘం నాయకులు రామయ్య, పెద్దన్న, సత్యసాయి తాగునీటి సరఫరా యూనియన్ నాయకులు నరేష్, మధు, శ్రీనివాస్, ఇంజనీరింగ్ సెక్షన్ నుంచి రమణ, రమేష్, గణేష్, ఆటో యూనియన్ నాయకులు మాధవరాజు, నాగభూషణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలి : సిఐటియు

హిందూపురంలో ఆందోళన చేస్తున్న నాయకులు

చిలమత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- హిందూపురం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, స్వంత గనులు కేటాయించాలని, సెయిల్ లో విలీనం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టి, అంబేద్కర్ సర్కిల్ లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాలు, ప్రాణాలు బలిదానం ఫలితంగా వచ్చిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేసి దోపిడీదార్లకు కట్టబెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. 35 ఏళ్ల నుంచి విశాఖ ఉక్కు కర్మాగారంలో 13 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు కోర్, నాన్ కోర్ విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారన్నారు. వారికి వేతనాలు అరకొరగానే దక్కుతున్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు రిటైరైన తర్వాత కొత్తగా రిక్రూట్ మెంట్ జరగడం లేదని, దీనివల్ల కాంట్రాక్టు కార్మికులపై పనిభారం పెరిగిందని అన్నారు. దీనిపై ప్రశ్నిస్తే యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను వేధిస్తూ ఇష్టానుసారంగా తొలగించడంతో మిగతా కార్మికులు సమ్మె చేశారని, దీంతో కక్షగట్టిన యాజమాన్యం 5,541 మంది కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులను విస్మరించి తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, పరిగి మండలం కన్వీనర్ శివకుమార్, సిఐటియు నాయకులు నందీశ్వర, బైలప్ప, మారుతి రెడ్డి, రవిచంద్ర రెడ్డి, రామకృష్ణ, చలపతి, రమేష్ బాబు, ఎం శ్రీనివాసులు రెడ్డి, ఆంజనేయులు, గోపాలప్ప, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, నరసింహమూర్తి, ఆర్ ఎల్ ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, లక్ష్మీకాంతం, హిందూపురం మున్సిపల్ యూనియన్ కోశాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు వీడనాడాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ధర్మవరంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు జెవి. రమణ ఎల్, ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ లో కాంట్రాక్టు కార్మికులను సమ్మె చేస్తున్నారనే కారణంగా వారిని అన్యాయంగా విధుల నుండి తొలగించడం దారుణమన్నారు. గత ముప్పై సంవత్సరాలనుండి విశాఖ ఉక్కు పరిశ్రమలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసమే కొన్ని రోజులగా సమ్మెలో పాల్గొన్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలతో కార్మికులని పోలీసు యంత్రాంగం ద్వారా బెదిరింపులకు గురి చేసిందన్నారు. ఈ ప్రభుత్వాలకి ఏ మాత్రం ఇది మంచిది కాదన్నారు, కాంట్రాక్టు కార్మికులకు నోటీసులు జారీ చేసారని, సమ్మెలో పాల్గొన్నారన్న కారణంతో యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురిచేసినదన్నారు, ఇటువంటి కార్మిక వ్యతిరేక చర్యలను సిఐటియు ఖండిస్తోందన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే డ్యూటీలో నియమించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు హైదర్ వలి, చంద్రకళ, సరస్వతి, పోతక్క అరుణ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సిఐటియు అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం దాదాపు మూడు సంవత్సరాలుగా కార్మికులు ఆందోళన పోరాటాల నిర్వహిస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదన్నారు. ఈ ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగ భద్రత, ప్రజల ఆర్థిక హక్కులు పాడవుతాయని, ప్రభుత్వం ప్రజల మనోభావాలను పట్టించుకోకపోతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామచంద్ర, ప్రవీణ్ కుమార్, సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాలను చూపిస్తూ ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యను వ్యాపారం చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి నిలువు దోపిడికి పాల్పడుతున్న కార్పోరేట్, ప్రవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు, సోమవారం పట్టణంలోని నారాయణ, భాష్యం పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతు పాఠశాలలో పుస్తకాలు, ఇతర విద్యా సామాగ్రి విక్రయించారాదన్న నిబంధనలు ఉన్నప్పటికి యాజమాన్యం విక్రయింస్తుందని వెంటనే ఈ పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి ఫీజులు నిర్ణయించాల్సి ఉన్నప్పటికి ఒక్క సారి కుడా సమావేశం నిర్వహించకుండా యాజమాన్యం వారికి ఇష్టం వచ్చినట్లు ఫీజులను వసూలు చేయడమే కాకుండా నోటు పుస్తకాల నుంచి విద్యార్థులు అవసరమైన సాక్సుల వరకు ఇక్కడే కొనాలని నిబంధనలు విధించి తల్లిదండ్రుల కష్టాన్ని సొమ్ము చేసుకొంటున్నారయన్నారు. చర్యలు చేపట్టాల్సిన విద్యాశాఖ అధికారులు వారు ఇచ్చే ముడుపులు తీసుకుంటూ చట్టాలను కార్పోరేట్ విద్యాసంస్థలకు చుట్టాలుగా మార్చారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు వెంటనే వచ్చి చర్యలు తీసుకునే వరకు తమ ఆందోళనను విరమించమన్నారు. ఈ విషయం తెలుసుకొన్నా మండల విద్యాశాఖఅధికారి గంగప్ప అక్కడికి చేరుకోని పుస్తకాలు విక్రమించే గదిని సీజ్ చేయడంతో ఆందోళన విరమించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఇఒతో మాట్లాడుతు పట్టణంలో నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో అట్టి విద్యాసంస్థలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక్ష ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఆఫ్రీద్, నాయకులు అజ్మల్, ఉమేష్, మోరియా, విశాల్, చింటూ, కౌశిక్, బిల్లు, బిలాల్, రషీద్, ఇస్మాయిల్, కుశాల్, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని సిరివరం పంచాయతీ పరిధిలోని తిరుమల దేవరపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణప్ప భార్య సునీత(39) సోమవారం బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కడుపునొప్పి కారణంగా జీవితంపై విరక్తి చెందిన సునీత ఇదే గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సునీత కూతురు మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రేమ పేరుతో యువతిని నమ్మించి ఆమె ఆత్మహత్యకి కారణమైన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి పట్టణానికి చెందిన అమ్మాయిని పుట్టపర్తి మండలం దిగువ చెర్లోపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. శారీరకంగా వాడుకొని మోసం చేసిన విషయములో ఆ అమ్మాయి అతని వేధింపులు భరించలేక మనస్థాపముతో ఈనెల 3న ఎలుకల మందు తాగి మృతిచెందింది. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు ప్రకాష్‌ను అరెస్ట్ చేసినట్లు సిఐ చెపాపరు. కదిరి ఇంచార్జి అనంతపురము కోర్టు వారి వద్ద హాజరు పరచగా, కోర్టు నిందితుడికి రిమాండ్ విధించిందన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రంలో అక్రమంగా ఇంటిలో నిలువచేసిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని బందావనం కాలనీలో నివాసముంటున్న మల్లికార్జున నాయక్ అక్రమంగా తన ఇంటిలో ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడని అనంతపురం రీజినల్ విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, బత్తలపల్లి రెవెన్యూ అధికారులు మల్లికార్జున నాయక్ ఇంటిని తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచుకున్న 750 కేజీల స్టోర్ బియ్యాన్ని గుర్తించారు. రేషన్ బియ్యాన్ని ప్రజల నుండి 1 కేజీ రూ. 18లకు కొని వాటిని బెంగళూరులో రూ. 24ల ప్రకారం విక్రయించేందుకు అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసుల విచారణలో తేలింది. అక్రమంగా నిలువ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై ఫిర్యాదు చేసినట్టు తహశీల్దార్ స్వర్ణలత తెలిపారు. ఈదాడుల్లో బత్తలపల్లి సిఎస్‌డిటి రామకృష్ణ, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, రీజినల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ రవీంద్రనాథ్, విఆర్ఒ చెన్నకేశవ ప్రసాద్, విఆర్ఎ నరసింహులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై సామూహిత అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఎస్పీ రత్నను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయం ముందు వారు మాట్లాడుతూ దళిత బాలికపై అఘాయిత్యం జరిగినా దళిత మహిళ అయిన హోం మంత్రి స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. మహిళలకు అన్యాయం జరిగితే అదే వారికి చివరి రోజు అని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పుడేం సమాధానమిస్తారని.ప్రశ్నించారు, ఎప్పుడూ సనాతన ధర్మం గురించి మాట్లాడే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దళిత మహిళకు అన్యాయం జరిగితే చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో తరచూ జరుగుతున్న నేరాలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. రామగిరి మండలం లో జరిగే నేరాలు బయటకు రావడంలేదని మూడు పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసి ఎస్పీ స్థాయి అధికారిని రామగిరి, కనగానిపల్లి మండలాలకు ఇన్‌ఛార్జిగా నియమించాలని డిమాండ్ చేశారు. తప్పు చేసినా మా వాడే అంటూ అక్కడ పరిటాల కుటుంబం వెనకేసుకొస్తుండడం వల్లనే ఇటువంటి అఘాయిత్యాలు తరచూ జరుగుతున్నాయని ఆరోపించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా చూడాలని ఎస్పీని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ పెన్నోబిలిష్, నరసింహమూర్తి, సోమందేపల్లి జడ్పిటిసి చంద్రకుమార్, ధర్మవరం ఎస్సీ ఎస్టీ సెల్ నారాయణ స్వామి, జిల్లా అధికార ప్రతినిధి ఫోటో సాయి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాతంగి తిప్పన్న, ఎస్‌టిడి నరసింహులు, ఎస్సీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె బాట పడతామని ఏపీ మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ క్రాంతి కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. పలు సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈ నోటీస్ అందజేసిన 15 రోజులలోపు సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మెబాట పట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పెడపల్లి బాబా, సి. నరసింహులు, ఇంజనీరింగ్ కార్మికులు గంగాద్రి, రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

సొంత శాఖకు 'పురం'మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న సంఘం శ్రీనివాసులకు సొంత శాఖకు బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. సంగం శ్రీనివాసులు డిఆర్‌డిఎలో అకౌంట్స్ అధికారిగా గతంలో విధులు నిర్వహించేవారు. ఇతని సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2017 లో మున్సిపల్ శాఖకు ఫారిన్ సర్వీస్ కింద తీసుకోవడం జరిగింది. కళ్యాణదుర్గం, మడకశిర మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ అనంతపురం కార్పొరేషన్ లో సెక్రటరీగా విధులు నిర్వహించే సమయంలో హిందూపురం మున్సిపల్ కమిషనర్ గా గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో బాధ్యలు స్వీకరించారు. ఆ సమయంలో మే 9వ తేదీ వరకు మాత్రమే మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించే విధంగా ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. గడువు ముగిసిన నెల రోజులు గడిచినప్పటికీ బదిలీ చేయకపోవడంతో మరి కొన్ని రోజులు ఇతన్ని ఇక్కడే కొనసాగించే విధంగా ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నాయని చాలామంది ఊహించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొంత శాఖకు సంఘం శ్రీనివాసులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సంఘం శ్రీనివాసులు హిందూ పురపాలక సంఘంలో 8 నెలల పాటు కమిషనర్ గా బాధ్యతలను నిర్వర్తించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున ను హిందూపురం మున్సిపల్ కమిషనర్ గా నియమించే అవకాశాలు ఉన్నాయి.

ఎకరాకు రూ. 60 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎకరాలకు రూ.60 లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని టేకులోడు గ్రామ పంచాయతీలో భూసేకరణ అంశంపై సోమవారం గ్రామసభ జరిగింది. ఈ సభలో పెనుగొండ ఆర్డీవో ఆనంద్ కుమార్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పాల్గొన్నారు. భూముల ధరలపై ప్రజల అభిప్రాయాలను రైతులతో సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గతంలో పరిశ్రమల పేరుతో భూములు తీసుకున్నప్పటికీ ఎలాంటి పరిశ్రమలు రాకపోవడంతో నష్టపోయామన్నారు. ఇప్పుడు మళ్లీ భూములు తీసుకుంటే వలసలు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మరికొందరు రైతులు మాత్రం సరైన ధర పొందితే భూములను అమ్మేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా రైతుల అంచనాలకు అధికారుల అంచనాలకు చాలా వ్యత్యాసం ఉండటంతో ధర నిర్ణయించకుండానే సభ ముగిసింది. నష్టపరిహారంగా ఎకరాకు 60 లక్షలు ఇవ్వాలని కోరారు. అయితే మార్కెట్ విలువ ప్రకారం అందులో సగం కూడా అధికారులు ఇచ్చే పరిస్థితి కనపడడం లేదు.

వీరాపురం పక్షుల సంరక్షణకు భూసేకరణ మినహాయింపు ఇవ్వండి : మండలంలోని వీరాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని భూములను భూసేకరణ నుండి మినహాయించాలంటూ గ్రామస్తులు డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్ కు వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో సైబీరియన్ వలస పక్షులు వీరాపురంలో ఆశ్రయం తీసుకుని సంతానోత్పత్తి చేస్తాయని తెలిపారు. 2008లో భూసేకరణ ప్రయత్నాల సమయంలో కూడా ఈ వలస పక్షుల పరిరక్షణకు సంబంధించి బయోడైవర్సిటీ చట్టం 2002 ప్రకారం ప్రాంతాన్ని భూసేకరణ జాబితా నుండి తొలగించారని గుర్తు చేశారు. తాజాగా పరిశ్రమల పేరుతో జరుగుతున్న భూ సర్వేలు పక్షుల నివాసాలకు ముప్పు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాన్ని బయోలాజికల్ హెరిటేజ్ హబ్‌గా గుర్తించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, భూసేకరణ నుంచి మినహాయించాలని గ్రామస్తులు కోరారు.

గ్రామ సభలో పాల్గొన్న రైతులు, అధికారులు

తన్మయి కేసు విచారణను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్యకేసు దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేయాలని కదిరి డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ బి రాంప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో తన్మయి హత్యకు గురైందని విమర్శించారు. హత్యకు పాల్పడిన దుండగులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వర్షాకాలం ఆసన్నమవుతున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ ఫిరోజాబేగం సూచించారు. ఈ మేరకు ఆమె సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి డివిజనల్ స్థాయిలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్స్ సిబ్బందికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ బేగం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిపిఒ నాగరాజు, ఎస్ఒ కళాధర్, డిపిహెచ్ఎన్ఒ వీరమ్మ, ఎపిడి మాలజిస్ట్, బాలాజీ నాయక్, డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న డిఎంహెచ్ఒ

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

2047 సంవత్సరం నాటికి ఆరోగ్యకరమైన సంపన్నమైన సంతోషకరమైన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అని కలెక్టర్ టీఎస్ చైర్మన్ తెలిపారు. సోమవారం ఉదయం యోగాంధ్ర అవగాహన మహా ర్యాలీని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, జిల్లా ఎస్పీ రత్న పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెల 21 నుంచి జూన్ 21న రానున్న అంతర్జాతీయ యోగ దినోత్సవం వరకు జిల్లాలోని పుట్టపర్తి, లేపాక్షి, కదిరి, ధర్మవరం ప్రాంతాలలో పర్యాటక, యోగ మాసోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో రానున్న ప్రపంచ యోగా దినోత్సవం లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం లో ప్రధాని మోడీ పాల్గొనడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎస్పి రత్న మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఆర్ కె బీచ్ చిత్రావతి రహదారిలో యోగా ప్రాధాన్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు, నర్సింగ్ అకాడమీ విద్యార్థులు, మెప్మా, పర్యాటక శాఖ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జెండాఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

మహిళలను గౌరవించలేని పార్టీ వైసిపి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసిపి అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు కనీస సంస్కారం లేకుండా మహిళలనే కనీసం జ్ఞానం లేకుండా గౌరవించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారనిఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. సోమవారం కదిరి పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను గౌరవించలేని పార్టీ వైసీపీ అని అన్నారు. ఆ ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి మీడియాలో అనుచితంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. వైసీపీ అధినేత జగన్ బేషరతుగా రాష్ట్రంలోని మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు వ్యక్తం అవుతున్న జగన్మోహన్ రెడ్డి, భారతి రెడ్డి స్పందించకపోవడం శోచనీయమన్నారు. జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా ఈ నెల 12వ తేదీన విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు కాసిం ,ఆల్ఫా ముస్తఫా నాయకులు జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే